క్లుప్తంగా

దాడులను ఖండించండి



తెనాలిఅర్బన్: పాలస్తీనాపై ఇజ్రాయేల్ చేసిన దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలని ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి సి.హెచ్.శ్రీదేవి పేర్కొన్నారు. తెనాలి ఇస్కఫ్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం పాలస్తీనా సంఘీభావ సభను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు బెజ్జంకి నాగమణి, అరసం జిల్లా ఉపాధ్యక్షులు కనపర్తి బెనహర్, జగన్‌మోహన్‌రావు, బొల్లిముంత కృష్ణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కిల్కారి కాల్ సేవలు ఉపయోగించుకోండి



తెనాలిఅర్బన్: గర్భిణి, బాలింతల ఆరోగ్య సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కిల్కారి కాల్ సేవలను నూతనంగా ప్రవేశపెట్టిందని ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు పేర్కొన్నారు. కిల్కారి ప్రోగ్రామ్‌పై గంగానమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిల్కారి కాల్ ద్వారా తల్లిబిడ్డల ఆరోగ్య సమాచారం సేకరించి అవసరమైన సూచనలు అందజేస్తారని చెప్పారు. కిల్కారి కాల్స్ గర్భందాల్చిన 4వ నెల నుంచి ప్రసవించే వరకు వస్తునే ఉంటాయన్నారు. సమావేశంలో టీబీయూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, సూపర్‌వైజర్ రవికుమార్, హెచ్‌వీ విజయ్‌కుమారి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యోగా శిక్షణ శిబిరం



తెనాలిఅర్బన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన యోగ శిక్షణ శిబిరాలు మంగళవారం కొనసాగాయి. స్థానికులు అక్కడకు వచ్చి యోగా చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 21న పట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

తెనాలిరూరల్: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని అంగలకుదురు నుండి కోపల్లెకు వెళ్లే డొంక రోడ్డులోని తెనాలి-గుంటూరు రైలు మార్గంలో గల రైల్వే గేటును మూసి వేయనున్నట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి గురువారం సాయంత్రం ఆరుగంటల వరకు రెండు రోజులు గేటును రైల్వే అధికారులు మూసివేస్తారని, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నిజాంపట్నం: ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలని మండల విద్యా శాఖ అధికారి శేషుగోపాల్ అన్నారు. మండలంలోని నిజాంపట్నం ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు, వర్క్ పుస్తకాలు, బ్యాగ్, షూలను ఉచితంగా అందిస్తోందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారన్నారు. తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జీ రజని, హెచ్‌ఎం చుక్కా బాపయ్య, ఉపాధ్యాయులు ఆరీఫున్నీసా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నత చదువుకు సహాయం

మేడికొండూరు: పాములపాడుకు చెందిన నేతగాని ప్రవల్లిక ఇంటర్మీడియట్‌లో బైపీసీ మొదటి ఏడాది 440కు 420 మార్కులతో ప్రతిభచూపారు. తండ్రి లేని విద్యార్థిని ప్రవల్లికను తల్లి శిరీష చదివిస్తున్నారు. ఈ సందర్భంగా పైచదువులకు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ చైర్మన్ శ్రీవ్యాల్, ప్రతినిధులకు విద్యార్థిని పరిస్థితి తెలిపారు. చైర్మన్ శ్రీవ్యాల్ విద్యార్థిని చదువుకు స్ఫూర్తి ఫౌండేషన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. దీంతో మొదటి విడతగా రూ.1.15 లక్షల చెక్కును పంపగా.. శివప్రసాద్ ప్రవల్లికకు మంగళవారం చెక్కును అందజేశారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తాం

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిఅర్బన్: విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తెనాలి నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి మొదటి ఏడాది అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. రెండోవ సంవత్సరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడంతో పాటు వైద్యశాలలను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వాటి అభివృద్ధికి కావాల్సిన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకురానున్నట్లు ప్రకటించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కోసం ఫైన్ రైస్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించడం జరిగిందన్నారు. వాటినే మధ్యాహ్న భోజన పథకానికి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైస్ బ్యాగ్‌లపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాని ద్వారా ఏ రైతు దానిని పండించాడో తెలిసే అవకాశం ఉందన్నారు. త్వరలో పాఠశాలలకు బియ్యం అందించిన రైతులను తాను, మంత్రి నారా లోకేష్ అదే పాఠశాలలో సన్మానించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఆ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేయనున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనేక మౌళిక వసతుల కోసం మున్సిపల్ నిధులు వెచ్చించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మిగిలిన పనులను కూడా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి సహకారంతో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఏఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు, కౌన్సిలర్ కొమర బత్తుని జయపాల్; ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

+ రజకపేటలోని ఆలపాటి వెంకట్రామయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను 6వ వార్డు కౌన్సిలర్ కొత్రపాటి లక్ష్మీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్రపాటి శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కొల్లిపర: రైతులు ప్రభుత్వం సబ్సిడీలపై అందిస్తున్న యంత్ర పరికాలు, వివిధ రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం కొల్లిపర గ్రామంలోని పాలకేంద్రం కల్యాణ మండపంలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీలపై అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు వ్యవసాయ యంత్ర పరికాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జరిగిన సభకు అధ్యక్షతగా మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దారు జి.సిద్దార్థా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దోమలతో అప్రమత్తంగా ఉండండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: దోమల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళికృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మారీసుపేట, లక్ష్మీనగర్ కాలనీలో మంగళవారం దోమల నియంత్రణ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు దోమలకు అవాసాలని తెలిపారు. నీటిలో దోమలు గ్రుడ్లు పెట్టి తమ సంతతిని పెంచుకుంటాయని వివరించారు. ఇవి కుట్టడం వలన మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. 2027 నాటికి భారతదేశంలో మలేరియాను పూర్తిగా నిర్మూంచాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం ఎన్‌సీఆర్ స్కూల్‌లోని విద్యార్థులకు దోమల నియంత్రణ చర్యలు తెలియజేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ కరిముల్లా, ఎన్‌సీసీ అధికారి పులి భాస్కరరావు, ఉపాధ్యాయులు బత్తుల శ్రీనివాసారావు, సబ్ యూనిట్ అధికారులు వంగాల పున్నారెడ్డి, శ్రీకంత ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, జి.రవికుమార్,దీపాల శ్రీనివాసరావు, దాసరి నాగమల్లేశ్వరరావు, బందారు మల్లేశ్వరరావు, తిరువీధుల శివరామప్రసాద్, షేక్ రషీద్, షేక్ నవీద్, షేక్ కరిముల్లా పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సుబ్బరాయణం, విద్యార్థులు

అదానీ విద్యుత్ మీటర్లను అడ్డుకోండి

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో బిగిస్తున్న అదానీ విద్యుత్ మీటర్లను ప్రజలందరూ అడ్డుకోవాలని సీఐటీయూ నాయకులు కేబీ ప్రసాద్ కోరారు. విద్యుత్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ చినరావూరులో న్యాయవాది పిల్లి ప్రేమరాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కరపత్రాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రవేటీకరణలో భాగంగా మొదట మీటర్లు మార్పు చేస్తున్నారని ఆరోపించారు. పగలు ఉపయోగించిన పవర్‌కు ఒక ధర, రాత్రి దానికి మరొక ధర నిర్ణయించి వసూలు చేసే అవకాశం ఉందన్నారు. ఇక నుంచి రీడింగ్ తీసేందుకు ఎవరు రారాని, ముందుగా వాటికి నగదు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా జరుగుతుందని చెప్పారు. దీనిని ప్రజలందరూ అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో బుద్దిస్ట్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి వై.ఆశోక్‌కుమార్, సీఐటీయూ నాయకులు సరళకుమారి, లలిత, దీనమ్మ, శోభ, శాంతకుమారి, బేబి, విజయ, సౌభాగ్యం, లక్ష్మి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రసాద్

రేపు ఈమనిలో ఆలయ వార్షికోత్సవం

ఈమని(తెనాలి): దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలోని శ్రీదత్తసాయి ప్రేమమందిరం 19వ ప్రతిష్ఠ వార్షిక ఉత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీవరకు నిర్వహించనున్నారు. శ్రీదత్తసాయి ప్రేమమందిరం, శ్రీఅన్నపూర్ణ ఉచిత హోమియో వైద్యసేవా కేంద్రం, కొత్రపాటి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ ఉత్సవాలను తొలిరోజు ఉదయం ఆరు గంటలకు పతాకావిష్కరణతో ఆరంభిస్తారు. తదుపరి 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదాయ భజనలు నిర్వహిస్తారు. 20న ఉదయం 8 గంటల్నుంచి సాయంత్రం 5 గంటల వరకు 'శ్రీసాయి సచ్చరిత్ర' సామూహిక పారాయణం చేస్తారు. తెనాలి మారీసుపేటలోని 'శ్రీసాయిసన్నిధి' వ్యవస్థాపక నిర్వాహకుడు హెచ్ఆర్ లక్కరాజు నిర్వహణలో పారాయణ ఉంటుంది. 21వ తేదీన శ్రీసాయిబాబాకు 'విశేష అభిషేకాలు', శ్రీసాయిమంత్ర జప తర్పణ హోమాలు అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు అన్న ప్రసాద వితరణ ఉంటాయని నిర్వాహకులు తెలియజేశారు. అదేరోజు రాత్రి శ్రీ మహానందీశ్వర నాట్యమండలి, తెనాలి వారిచే 'గయోపాఖ్యానం' యుద్ధఘట్టం', పాండవ ఉద్యోగ విజయాల నుంచి 'శయన ఘట్టం' పౌరాణిక నాటక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.



దత్తసాయి ప్రేమమందిరంలో సాయిబాబా

ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు,లారీ ఢీ



దుగ్గిరాల: మంగళగిరి-తెనాలి మెయిన్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ సంఘటన మంగళవారం తుమ్మపూడి దగ్గర చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. తెనాలి నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. బస్సు డ్రైవరు చాకచక్యంగా బ్రేక్ వేయడంతో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరుగలేదు. ఘటనా స్థలంలో ట్రాఫిక్ భారీగా ఆగిపోవడంతో దుగ్గిరాల ఎస్సై ఎస్.వెంకటరవి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

మండల వ్యవసాయ అధికారిగా విజయరాజు



నిజాంపట్నం: మండల వ్యవసాయ శాఖ అధికారిగా చుక్కా విజయరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై నిజాంపట్నం విచ్చేశారు. ఇక్కడ వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న శారద బాపట్లకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ పంటలు అత్యధిక దిగుబడి సాధించేలా సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి రైతుకు అందేలా పనిచేస్తానని చెప్పారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

నిజాంపట్నం: అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ పల్లపట్ల ప్రాజెక్ట్ కమిటీ నాయకులు మంగళవారం పల్లపట్ల సీడీపీవో అనసూయకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లపట్ల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై.మేరిమణి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో బాధ్యతలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వ పథకాల నుంచి దూరం చేయటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ పాలక ప్రభుత్వాలు అంగన్‌వాడీలను అన్ని సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నాయన్నారు. కేవలం జీతభత్యాల చెల్లింపుల్లో కార్మికులుగా చూస్తూ అరకొర జీతాలతో సరిపెడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయని పక్షంలో అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని ప్రయోజనాలను వర్తింపజేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉష, బేబీ రాణి, గాయత్రి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.



సీడీపీవో అనసూయకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు

భట్టిప్రోలు(వేమూరు): మాజీ రాజ్యసభ సభ్యుడు కామ్రేడ్ మోటూరు హనుమంతరావు వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, క్విచ్ పోటీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా మోటూరు హనుమంతరావు గెలుపొందారన్నారు. విద్యార్థులకు భారత రాజ్యంగం విశిష్టత, ప్రజాస్వామ్యం విలువలు తెలియజేయాలన్న ఉద్దేశంతో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. క్విజ్ మాస్టర్‌గా గుర్రం మురళీమోహన్ వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు 18వ తేదీ మోటూరు హనుమంతరావు వర్ధంతి రోజున బహుమతులు అందజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అమెరికా ప్రోద్బలంతో బాంబు దాడులు



ప్రాతూరులో నిరసన చేపట్టిన నాయకులు



అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన

తాడేపల్లి రూరల్: గాజా, పాలస్తీనా, ఇరాన్ దేశాలపై అమెరికా ప్రోద్బలంతో జరుగుతున్న బాంబు దాడులను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఉండవల్లి సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి మాట్లాడుతూ.. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ పాలస్తీనాపై దుర్మార్గంగా దాడులు కొనసాగిస్తోందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు టి.బక్కిరెడ్డి, ఈమని రామారావు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాఘవయ్య, కె.రామకృష్ణ, పార్ధసారథి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ప్రాతూరులో తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమానికి సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మంగళగిరి ఏరియా సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, సీపీఐ తాడేపల్లి ప్రాంత నాయకులు తుడిమెళ్ల వెంకటయ్య, సీపీఎం తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు, నాయకులు అమ్మిశెట్టి రంగారావు, డోకిపర్తి రాజేంద్రబాబు, నాగపోగు విజయరాజు, షేక్ గన్, నల్లపు లెనిన్, గుండిమెడ జయరావ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: గాజా, పాలస్తీనాలపై అమెరికా మద్దతులో ఇజ్రాయిల్ బాంబు దాడులను చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం నగర పరిధిలోని అంబేద్కర్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ నాయకులు మానవహారం చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్, నాయకులు చెంగయ్య, జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, కమలాకర్, బాలాజీ, సీపీఐ నాయకులు ప్రభాకర్, చిన్ని సత్యనారాయణ, సీపీఐఎంఎల్ నాయకులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలి

మంగళగిరి టౌన్: తల్లికి వందనం పథకం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు పారిశుద్ధ్య కార్మికులకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం ఎంటీఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మంగళగిరి పట్టణ అధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ, నాయకులు శివనాగేశ్వరరావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు

అంగన్‌వాడీలకు వంట సామగ్రి అందజేత



రేపల్లె: అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించటంతో పాటు నాణ్యత విలువలు పాటిస్తూ ఆహారాన్ని అందించాలని టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ క్యాంప్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం వంట సామగ్రిని అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సెక్టారు పరిధిలోని 122 అంగన్‌వాడీ సెంటర్‌లకు వంట సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద భారతీయ రిజర్వు బ్యాంకు, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత గురించి బ్యాంకు ఖాతాదారులకు లావాదేవీలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామసర్పంచ్ మెల్కియా మాట్లాడుతూ.. ప్రభుత్వ బ్యాంకుల్లో మాత్రమే ప్రజలు ఆర్థిక లావాదేవీలు నడపాలన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కె.సాల్మన్‌పాల్ మాట్లాడుతూ.. ప్రతి మహిళ ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి సురక్ష వంటి బీమా సౌకర్యాలను వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్ రమాదేవి, సంస్థ రిసోర్స్ పర్సన్స్ వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, తురకా మంగయ్య, వెలుగు మహిళ సమాఖ్య అధ్యక్షురాలు చిరంజీవి, యానిమేటర్లు పద్మ, మేరిమ్మ, ప్రమీల, అలేఖ్య, కమలకుమారి, సంఘసభ్యులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: యువత బ్యాంకింగ్ వ్యవస్థ పట్ల అవగాహన కలిగి ఉండాలని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.నాగేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. తమ కళాశాలలో సమీకృత గిరిజన గ్రామీణాభివృద్ధి సంస్థ, రిజర్వ్ బ్యాంక్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల విద్యార్థులకు డిపాజిటర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్లు వై.శ్రీనివాసరావు, ఆర్ఎస్ శంకరరావు, ఆర్టిడ్స్ కార్యదర్శి సాంబశివరావు, కోఆర్డినేటర్లు షేక్ హుస్సేన్, విజయలక్ష్మి, బిక్షారావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన సరుకులు

ఫిరంగిపురం: తక్కువ ఖర్చుతో నాణ్యమైన సరుకులు అందించడమే వెలుగు మహిళమార్టు లక్ష్యమని జిల్లా వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి.వి. విజయలక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు మహిళమార్టును మంగళవారం ఆమె పరిశీలించారు. రోజూ జరిగే విక్రయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళ స్వయం సహాయ సంవృద్ధి కోసం వెలుగు ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంఘసభ్యులకు త్వరలో పలు రకాల జీవనోపాధి కల్పించేలా పలు అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆసక్తి గలిగిన మహిళలు సుమారు 30 మంది వరకు ఉన్నట్లయితే మండల కేంద్రంలోనే శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆమె వెంట ఏపీఎం నాగేశ్వరరావు, సీసీ కరిముల్లా, సిబ్బంది ఉన్నారు.

ఇరువర్గాలపై కేసులు

తాడికొండ: తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో ఇరువర్గాలు వివాదాలకు దిగి రాళ్లు రువ్వుకున్న ఘటనలో ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఎస్సీ కాలనీలోని ఇరువర్గాలు గత రెండు రోజులుగా దాడులకు పాల్పడుతూ రాళ్ల దాడులకు పాల్పడుతుండడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపల్లెలో విద్యుదాఘాతంతో బేకరీ దగ్ధం

రేపల్లె: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం వాటిల్లి బేకరీ దగ్ధమైన ఘటన పట్టణంలోని మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు వివరాల మేరకు రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీ సాయి బేకరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. మంటలు బేకరీ దుకాణమంత వ్యాపించి దుకాణంలోని వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో తమ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసినట్లు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.3.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు చెప్పారు.



రేపల్లె పాలిటెక్నిక్ కళాశాలకు కౌన్సెలింగ్ సెంటర్



రేపల్లె: రేపల్లె పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషితో కళాశాలకు కౌన్సెలింగ్ సెంటర్ వచ్చిందన్నారు. తీరప్రాంత విద్యార్థులు కౌన్సెలింగ్ కొరకు గతంలో గుంటూరు, బాపట్ల ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. రేపల్లె కళాశాలకు అన్ని హంగులతో సొంత భవనం ఏర్పడటంతో పాటు, కౌన్సెలింగ్ సెంటరు రావటం ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. రేపల్లె కళాశాలలో ఎస్ఈసీ, సివిల్, మెకానికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 20వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.